AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
13-6-2026 (Saturday)
MAIN EDITION

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు




**అక్షరటుడే, హైదరాబాద్ :** శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌కు మరోసారి బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుండి శంషాబాద్ వస్తున్న ప్రముఖ 'లుఫ్తాన్స' విమానానికి గుర్తుతెలియని వ్యక్తులు బాంబు బెదిరింపు మెయిల్ పంపారు. విమానంలో మానవరహిత బాంబు ఉందని, అది ల్యాండ్ అయ్యేలోపే పేలిపోతుందంటూ ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు. తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదు. దీంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## హైదరాబాద్‌లో వర్ష బీభత్సం.. ముగ్గురు మృతి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీం:** హైదరాబాద్ నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్ష బీభత్సానికి ముగ్గురు మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌లో శుక్రవారం రాత్రి ఈదురుగాలుల వానకు రాఘవేంద్ర నగర్ కాలనీలో ఒక రేకుల ఇంటిపై తాటి చెట్టు కూలింది. ప్రమాదంలో సభావత్ లక్ష్మి అనే దివ్యాంగురాలు అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే అల్వాల్ పరిధిలో రోడ్డుపై తెగిపడిన కరెంట్ తీగలు తగిలి కరెంట్ షాక్‌తో శనివారం తెల్లవారుజామున రోడ్డుపై తెగిపడిన చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా కరెంట్ షాక్ తగలడంతో సందీప్, రితిక చనిపోయారు.

## ఐఎంఏ పరేడ్‌లో పాల్గొన్న రాష్ట్రపతి



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** డెహ్రాడూన్ ఇండియన్ మిలిటరీ అకాడమీ (ఐఎంఏ) పాసింగ్ అవుట్ పరేడ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. 158వ రెగ్యులర్ కోర్స్, 141వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్స్ కేడెట్ల విన్యాసాలను తిలకించారు. దేశ సేవలో భాగస్వాములవుతున్న యువ సైనిక అధికారులను ఈ సందర్భంగా రాష్ట్రపతి అభినందించారు.

## ప్రధాని మోదీ విదేశీ పర్యటన



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాని నరేంద్ర మోదీ నేడు విదేశీ పర్యటనకు వెళ్లారు. ఆరు రోజుల పాటు ఫ్రాన్స్, స్లోవేకియాలో దేశాల్లో పర్యటించనున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో భేటీ అవుతారు. భారతీయ స్టార్టప్‌లు, డీప్ టెక్, ఇన్నోవేషన్‌పై ఇరు నేతల చర్చించనున్నారు. అలాగే 52వ జీ7 సమ్మిట్‌లో పాల్గొంటారు.

## బస్సు లోయలో పడి ఎనిమిది మంది మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌లోని కావ్రేపలాం చోక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 24 మంది ప్రయాణికులతో కొండ ప్రాంత రహదారిపై వెళ్తున్న ఒక బస్సు ఒక్కసారిగా అదుపుతప్పింది. 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

## రక్షణ రంగంలో భారత్ కీలక ముందడుగు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రక్షణ రంగంలో భారత్ మరో మైలురాయి సాధించింది. సుదూర బాలిస్టిక్ క్షిపణుల నుంచి బహుళ అంచెల రక్షణను, మధ్య శ్రేణిలో నౌకా విధ్వంసక సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి వరుసగా మూడు పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. మల్టిపుల్ లేయర్ బ్యాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ (బీఎండీ) సామర్థ్యాన్ని విజయవంతంగా ప్రదర్శించింది. వైమానిక, సముద్ర ముప్పుల నుంచి భారతదేశ రక్షణ సామర్థ్యాలను గణనీయంగా పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన పలు కీలక సాంకేతికతలను ప్రదర్శించింది. అధికారిక వివరాల ప్రకారం, బహుళపొరల బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను ప్రదర్శిస్తూ విమాన పరీక్షలు నిర్వహించబడ్డాయి. ఈ పరీక్షల సమయంలో ఇంటర్‌సెప్టర్‌లు తమ లక్ష్యాలను విజయవంతంగా ఛేదించాయి. తద్వారా, అభివృద్ధి చెందుతున్న క్షిపణి ముప్పులను ఎదుర్కోవడానికి రూపొందించిన అధునాతన, వర్ధమాన సాంకేతికతలతో అభివృద్ధి చేసిన ఈ పొరల రక్షణ నిర్మాణం సమర్థత ధృవీకరించబడింది.

## కూలిన ఐఏఎఫ్ విమానం



అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన ఏఎన్-32 రవాణా విమానం శనివారం కూలిపోయింది. ల్యాండింగ్ సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు అధికారులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి.

–అక్షరటుడే, నేషనల్‌డెస్క్

- అస్సాంలోని జోర్హాట్ ఎయిర్‌బేస్‌లో ఘటన
- ఐదుగురు మృతి.. మరొకరికి గాయాలు
- విచారణ చేపట్టిన వైమానిక దళం

అస్సాంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఏఎన్32 విమానం వైమానిక స్థావరం ప్రాంగణంలోనే కూలిపోయింది. ప్రమాదం తర్వాత మంటలు చెలరేగాయి. మంటలను అదుపు చేయడానికి, పరిస్థితిని అంచనా వేయడానికి అత్యవసర సహాయక బృందాలను వెంటనే సంఘటనా స్థలానికి పంపించారు. జోర్హాట్‌లో విమానం ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నిస్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో ఒక పైలట్, నలుగురు సిబ్బంది మరణించగా, ఒక కోపైలట్ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ప్రాణనష్టంపై ఐఏఎఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొంది.

### మృతుల వివరాలు

భారత వైమానిక దళం ప్రకారం, మృతులైన ఐఏఎఫ్ సిబ్బందిలో ఒక స్క్వాడ్రన్ లీడర్, ఒక ఫ్లైట్ లెఫ్టినెంట్, ఇద్దరు అగ్నివీర్లు ఉన్నారు. స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభం కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ ఖేమారం కుమావత్, అగ్నివీర్ డానిష్ ఆలం ఈ ప్రమాదంలో చనిపోయారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు విమానం అరుణాచల్ ప్రదేశ్ నుంచి జోర్హాట్‌కు వెళ్తున్నట్లు సమాచారం.

### విచారణకు ఆదేశం

ఈ ప్రమాదం జరిగిన తర్వాత ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించడానికి భారత వైమానిక దళం కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించింది. రౌరియా వైమానిక దళ కేంద్రం ఈశాన్య ప్రాంతంలోని ఒక కీలకమైన భారత వైమానిక దళ స్థావరం, ఈ ప్రాంతంలో సైనిక కార్యకలాపాలు, లాజిస్టిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. 1986 నుంచి భారతదేశంలో ఏఎన్32 విమానాలు సుమారు 22 సార్లు ప్రమాదాలకు గురయ్యాయి.

### కీలక పాత్ర

ఏఎన్32 రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. ఇది భారత వైమానిక దళానికి "వర్క్‌హార్స్" (అత్యవసర సేవల విమానం)గా పనిచేస్తుంది. ప్రత్యేకంగా భారత అవసరాల కోసం సోవియట్ యూనియన్‌లో మొదట నిర్మించబడిన ఈ విమానాలలో సుమారు 100 విమానాలను ఐఏఎఫ్ నిర్వహిస్తోంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితులలో రాణించేలా దీనిని రూపొందించారు. ఇది 7.5 టన్నుల వరకు సరుకును, 50 మంది ప్రయాణికులను, లేదా 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి : కేటీఆర్



**అక్షరటుడే, వేములవాడ :** ఎస్ఐఆర్ జరిగిన ప్రాంతాల్లో బీజేపీ వాళ్లకు పడవన్న ఓట్లు అన్ని తొలగించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వేములవాడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. 'ఎస్ఐఆర్' తెచ్చి వెస్ట్ బెంగాల్‌లో 95 లక్షల ఓట్లు, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తీసేశారన్నారు. తమిళనాడులో మాజీ సీఎం స్టాలిన్ సొంత నియోజకవర్గంలో 80 వేల ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. దీంతో ఆయన 10 వేల ఓట్లతో ఓడిపోయారని చెప్పారు. తెలంగాణలో జూన్ 25 నుంచి 'సర్'ను తీసుకొస్తున్నారని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్‌లో డబ్బులకు పదవులను అమ్ముకుంటున్నారు అని షబ్బీర్ అలీ చెప్పింది నిజమన్నారు. రూ.50 కోట్లకు టీపీసీసీ పదవి రేవంత్ రెడ్డికి అమ్ముకున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా అన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, రెన్యువల్ సీఎం అని ఎద్దేవా చేశారు. సీఎం పదవి కూడా అమ్ముకున్నారు కాబట్టి.. రాహుల్ గాంధీ ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.

## సిరిసిల్ల ఎస్పీపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



**అక్షరటుడే, సిరిసిల్ల :** కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం సిరిసిల్లలో పర్యటించారు. సోమవారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య పాఠశాలలో 'మన బడి – మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బండి సంజయ్ పాఠశాలలో బెంచీలను కడిగారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన సందర్భంగా స్వాగతం పలకడానికి ఎస్పీ మహేశ్ హాజరు కాలేదు. బదులుగా వేరే అధికారి వచ్చి స్వాగతం పలికారు. దీంతో సంజయ్ ఎస్పీ తీరుపై ఆయనతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఎస్పీకి బీజేపీ కార్యకర్తలంటే కోపమెందుకు అన్నారు. కేటీఆర్‌పై అంత ప్రేమ ఎందుకన్నారు. బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఉంటే ఆ పార్టీలోనే చేరమని చెప్పండని పేర్కొన్నారు.

## కుక్కకు జీపీఎస్ ట్రాకర్ పెట్టినా.. దొరకని జాను ఆచూకీ




**అక్షరటుడే, ఏపీ:** కాకినాడ జిల్లా తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి (జాను) ఆచూకీ దొరకడం లేదు. పాప కనిపించకుండా పోయి వారం అవుతున్నా.. ఆమె జాడ తెలియకపోవడంతో తల్లిదండ్రులు అల్లాడుతున్నారు. దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలో యాభై ఎకరాల పామాయిల్ తోట ఉంది. ఈ తోటలో గణేష్, భవాని దంపతులు కాపలాదారులుగా పనిచేస్తున్నారు. కుమార్తె జానుతో కలిసి అక్కడే ఉంటున్నారు. అయితే గత శనివారం పెంపుడు కుక్కతో కలిసి రెండేళ్ల జాను ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ దొరకడం లేదు. అయితే పాపతో వెళ్లిన కుక్క ఇటీవల తిరిగి వచ్చింది. పాప ఎక్కడుందో కుక్కకు తెలిసి ఉంటుందని భావించిన పోలీసులు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. అయినా కూడా ఆచూకీ దొరకలేదు. కాగా.. ఈ కుక్క మరణించింది.

## జిమ్ ట్రైనర్ నీచమైన ప్రవర్తన



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** శిక్షణ పేరుతో జిమ్‌కు వచ్చే మహిళా పైలట్‌ను లైంగికంగా వేధిస్తూ, ఆమెను లోబరుచుకోవాలని ప్రయత్నించిన ఓ జిమ్ ట్రైనర్ ఉదంతం సనత్‌నగర్‌లో కలకలం రేపింది. ఈ కేసులో నిందితుడు సంతోష్ గౌడ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సనత్‌నగర్‌లోని ఒక ప్రముఖ 'కల్ట్' జిమ్‌లో మహిళా పైలట్ మెంబర్‌షిప్ తీసుకున్నారు. ఆ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న సంతోష్ గౌడ్, ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేశాడు. తన గర్ల్‌ఫ్రెండ్ రజినీతో కలిసి పథకం వేసిన సంతోష్, ఆమెను లోబరుచుకోవాలని ప్రయత్నించాడు. "మా ఇద్దరితో కలిసి ప్రైవేట్‌గా గడపాలి.. నాతో ఒక రాత్రి గడుపుతావా?" అంటూ నిందితుడు సంతోష్ గౌడ్ ఆమెపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడు. బాధితురాలు ఒప్పుకోకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడం మొదలుపెట్టాడు. దీంతో ఆమె సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

## నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..



**అక్షరటుడే, నల్గొండ :** నల్గొండ జిల్లా నందికొండ (నాగార్జున సాగర్) పరిధిలోని హిల్ కాలనీ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. హిల్ కాలనీ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఒక ఎస్‌యూవీ కారు, 'థార్' వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నందికొండలోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు.

## స్టంట్స్ చేస్తూ రియల్ స్పైడర్ మ్యాన్ మృతి



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఎటువంటి సేఫ్టీ లేకుండా నిటారైన కొండలను చాకచక్యంగా ఎక్కుతూ సోషల్ మీడియాలో 'యెమెన్ స్పైడర్‌మ్యాన్'గా పేరు తెచ్చుకున్న అల్‌ఖాఖా జీవితం విషాదాంతం అయ్యింది. దామత్ అగ్నిపర్వత కొండలపై విన్యాసాలు చేస్తూ జారి కింద ఉన్న లోతైన నీటి గుండంలో పడిపోయి మృతి చెందాడు. యువ విన్యాసకారుడు సుమారు 120 మీటర్ల లోతు ఉన్న అగ్నిపర్వత బిలంలోని నిటారు కొండలను ఎలాంటి భద్రతా పరికరాలు లేకుండా అధిరోహించడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో పట్టుతప్పి గుండంలో పడిపోయి చనిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న బృందాలు తీవ్రంగా శ్రమించి అతడి మృతదేహాన్ని వెలికితీశాయి.

## ధర్మస్థల వివాదం.. రిట్ పిటిషన్‌లో ప్రకాశ్‌రాజ్ పేరు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ధర్మస్థల పవిత్రతను దెబ్బతీసేందుకు జరిగిన కుట్రలో నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రమేయం ఉందన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న 'చిన్నయ్య' (ముసుగు మనిషి) హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రకాశ్‌రాజ్ పేరును ప్రస్తావించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ధర్మస్థల కేంద్రంగా వందలాది మంది యువతుల మృతిపై జరిగిన ప్రచారాలు, ఆరోపణల వెనుక భారీ కుట్ర ఉందని ఇప్పటికే సిట్ విచారణలో తేలింది. ఈ కుట్రకు సూత్రధారిగా భావిస్తున్న చిన్నయ్య హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో.. నటుడు ప్రకాశ్‌రాజ్ కుట్రదారులతో కలిసి, "నేను మళ్లీ వచ్చి మిమ్మల్ని కలుస్తాను" అని వ్యాఖ్యానించారని పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాకుండా, ధర్మస్థల పవిత్రతను దెబ్బతీసేందుకు కేరళ నుంచి ఏకంగా రూ. 200 కోట్ల బడ్జెట్‌తో కుట్ర జరిగిందని ఆ పిటిషన్‌లో చిన్నయ్య ఆరోపించారు.

### ప్రకాశ్‌రాజ్ ఏమన్నారంటే?

సోషల్ మీడియాలో తన పేరు రావడంపై ప్రకాశ్‌రాజ్ శుక్రవారం స్పందించారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల నమ్మకాలతో ముడిపడి ఉందని, కాబట్టి దీనిపై వివరణ ఇవ్వడం తన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తాను ప్రస్తుతం ఊరికి దూరంగా ఉన్నానని, రెండు రోజుల్లో తిరిగి వచ్చి మీడియా ముందు పూర్తి విషయాలను వెల్లడిస్తానని తెలిపారు.